హైదరాబాద్ నగరంలోని ఎల్‌బీ నగర్‌లో అర్ధాంతరంగా నిలిచిన టిమ్స్ దవాఖాన భవన నిర్మాణం



మధ్యలోనే నిలిచిన హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ టిమ్స్ దవాఖాన భవనం

కూల్చుడేనా.. కట్టొచ్చు కదా!

కూల్చివేతలపై శ్రద్ధ.. నిర్మాణాలపై నిర్లక్ష్యం! • అర్ధాంతరంగా నిలిచిన దవాఖానల నిర్మాణాలు

- బీఆర్ఎస్ హయాంలోనే చివరిదశకు వరంగల్ హెల్త్‌సిటీ
- శరవేగంగా సాగిన టిమ్స్ నిర్మాణాలకు కాంగ్రెస్ బ్రేకులు
- 350 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టిన రేవంత్ సర్కార్
- నిధులు లేక చేతులెత్తేసిన ఆర్‌అండ్‌బీ శాఖ
- నిమ్స్ విస్తరణ పనులూ నిలిపివేత!
- నిర్మాణాలు పూర్తయితే పేద రోగులకు ఎంతో మేలు

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ పేరుతో వేలాది పేదల ఇండ్లను కూల్చేయడంపై శ్రద్ధ పెట్టిన ప్రభుత్వం.. చెరువుల సంరక్షణ పేరుతో హైడ్రా ద్వారా వందలాది పేద, మధ్యతరగతి జీవితాలను రోడ్డున పడేయడంలో చొరవ చూపుతున్న ప్రభుత్వం.. పేదలకు నాణ్యమైన వైద్యం అందించే దవాఖానల నిర్మాణంపై మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నది. కూల్చడంపై ఉన్న ఆసక్తి నిర్మాణాలపై చూపకపోవడంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిమ్స్ దవాఖానల నిర్మాణ పనులు ఆగిపోయాయి. చివరి దశకు వచ్చిన వరంగల్ హెల్త్‌సిటీ పనులపై ప్రభుత్వం పంతానికి పోవడంతో ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. పేదలకు ఉత్తమమైన, నాణ్యమైన వైద్యసేవలు అందించడంతోపాటు గాంధీ, ఉస్మానియా, నిమ్స్ దవాఖానలపై ఒత్తిడి తగ్గించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ నలువైపులా టిమ్స్ దవాఖానల నిర్మాణాలు చేపట్టింది. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత పెద్ద నగరమైన వరంగల్‌లో హెల్త్‌సిటీ పేరుతో భారీ దవాఖాన నిర్మాణం మొదలు పెట్టింది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నన్నాళ్లూ ఈ నాలుగు భవనాల నిర్మాణ పనులు పరుగులు పెట్టాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. పనులకు సంబంధించి కాంట్రాక్టు ఏజెన్సీతో చేసుకున్న ఒప్పందానికి, జరుగుతున్న నిర్మాణానికి పొంతన లేదనే కారణంతో కాంగ్రెస్ ప్రభుత్వం దవాఖానల పనులను నిలిపివేసింది. విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో పాటు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.350 కోట్లు బిల్లులు పెండింగులో పెట్టింది. వాస్తవానికి, కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించిన అనంతరం అవసరాలకు అనుగుణంగా గత ప్రభుత్వం డిజైన్‌లో కొన్ని మార్పులు చేసింది. వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, మారుతున్న వైద్య విధానాలు, సాంకేతిక అంశాలను దృష్టిలో పెట్టుకొని మార్పులు జరిగినట్టు అధికారులు చెప్తున్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇందులో ఏదో మతలబు జరిగిందనే అనుమానంతో పనులను నిలిపివేసిందని అంటున్నారు. వాస్తవానికి వచ్చే ఏడాది మార్చినాటికే మూడు టిమ్స్ దవాఖానలను అందుబాటులోకి తేవాలని, అనంతరం ఉస్మానియా దవాఖాన పునర్‌నిర్మాణం చేపట్టాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. మూడు కొత్త దవాఖానలు అందుబాటులోకి వస్తే ఉస్మానియా దవాఖాన నిర్మాణం పనులు చేపట్టినా పేదల వైద్య సేవలకు ఇబ్బంది ఉండదనేది గత ప్రభుత్వ ఆలోచన. అయితే, ఇప్పుడు ప్రభుత్వం పనులు నిలిపివేయడంవల్ల వాటి నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో అర్థం కావడంలేదు. మరోవైపు నిమ్స్ విస్తరణ పనులు కూడా నిలిచిపోయినట్టు సమాచారం.ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేవరకు పనులు ముందుకు సాగే అవకాశం లేదని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు చెప్తున్నారు.

ఇది 'టిమ్స్' లెక్క

పరిపాలన అనుమతులు: 2022 ఏప్రిల్ 21

భూమిపూజ: 2022 ఏప్రిల్ 26

సనత్‌నగర్ టిమ్స్	అల్వాల్ టిమ్స్	ఎల్బీనగర్ టిమ్స్
విస్తీర్ణం: 17 ఎకరాలు	విస్తీర్ణం: 28.41 ఎకరాలు	విస్తీర్ణం: 21.36 ఎకరాలు
అంతస్థులు: జీ+14	అంతస్థులు: జీ+5	అంతస్థులు: జీ+14
పడకలు: 1000	పడకలు: 1000	పడకలు: 1000
నిర్మాణ వ్యయం అంచనా: రూ.882 కోట్లు	నిర్మాణ వ్యయం అంచనా: రూ.897 కోట్లు	నిర్మాణ వ్యయం అంచనా: రూ.900 కోట్లు

'టిమ్స్' జోరుకు బ్రేకులు

రాష్ట్రంలో ఇప్పటికీ సూపర్ స్పెషాలిటీ సేవలకు దశాబ్దాల క్రితం నిర్మించిన ఉస్మానియా, గాంధీ, నిమ్స్ దవాఖానలే దిక్కు. రాష్ట్రంలోని పేదలే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా తదితర పొరుగు రాష్ట్రాల రోగులు కూడా ఆయా దవాఖానలకు వస్తుంటారు. దీంతో సామర్థ్యానికి మించి రోగులతో నిత్యం కిటకిటలాడుతున్నాయి. సమయానికి వైద్యం అందక పేదలు నానా అవస్థలు పడుతున్నారు. వైద్యసిబ్బంది పనిభారంతో సతమతం అవుతున్నారు. ఈ ఇబ్బందులను దూరం చేయడంతో పాటు నగరానికి వచ్చే రోగులు ఎక్కడికక్కడే ఉత్తమ వైద్యసేవలు పొందేలా బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు టిమ్స్ (తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) దవాఖానల నిర్మాణానికి సంకల్పించింది. అల్వాల్, ఎల్బీనగర్, సనత్‌నగర్‌లలో రూ.2,679 కోట్ల అంచనాతో ఈపీసీ (ఇంజినీరింగ్-ప్రొక్యూర్‌మెంట్-కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో టిమ్స్ దవాఖానల నిర్మాణం చేపట్టింది. పనులు ప్రారంభం అయినప్పటి నుంచి పనులు వేగంగా సాగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి నిర్మాణాలు దాదాపు సగం పూర్తయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పనులను ఎక్కడికక్కడ నిలిపివేసింది. మరో ఏడాదిలో అందుబాటులోకి రావాల్సిన భవనాలు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి.

పెరుగుతున్న నిర్మాణ వ్యయం

వరంగల్ హెల్త్‌సిటీతోపాటు మూడు టిమ్స్ దవాఖానల నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.వందల కోట్లు వెచ్చించింది. పనులు సగం పూర్తయ్యాయి. ఇప్పుడు పనులు ఆలస్యం కావడంవల్ల నిర్మాణం వ్యయం పెరుగుతుందని అధికారవర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. వెంటనే పనులు తిరిగి ప్రారంభించి త్వరగా పూర్తి చేస్తే డబ్బు ఆదా అవడంతో పాటు పేదలకు మేలు కలుగుతుందని చెప్తున్నారు. వరంగల్ హెల్త్‌సిటీ పనులను మొక్కుబడిగా పరిశీలిస్తున్నారే తప్ప, నిధులు మంజూరు చేయడం లేదని చెప్తున్నారు. ఇప్పటికప్పుడు పేదల గుడిసెలను కూల్చి, రూ.లక్షన్నర కోట్ల ప్రాజెక్టులు కట్టేబదులు.. పేదలకు వైద్యం అందించే దవాఖానల నిర్మాణాలను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అనధికారికంగా డెంగీ కేసులు 10 వేలు దాటినట్టు చెప్తున్నారు. మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు కూడా విజృంభిస్తున్నాయి. ఫలితంగా గాంధీ, ఉస్మానియా, నిమ్స్‌పై విపరీతమైన ఒత్తిడి పెరిగింది. వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ నిర్మాణాలు పూర్తయితే ఇలాంటి ఇబ్బందులు తప్పుతాయ ని నిపుణులు చెప్తున్నారు. ప్రభు త్వం పంతానికి పోకుండా పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

హెల్త్‌సిటీ.. రాకెట్ వేగంతో పనులు

అనుమతులు:	2021 డిసెంబర్ 4
భూమి పూజ:	2021 జూన్ 21
విస్తీర్ణం:	19 ఎకరాలు
అంతస్తులు:	27
పడకలు:	2,000
నిర్మాణ వ్యయం అంచనా:	రూ.1,200 కోట్లు

వరంగల్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణ పనులను గత కేసీఆర్ ప్రభుత్వం ఎల్ అండ్ టీ సంస్థకు అప్పగించింది. 19 ఎకరాలు, 27 అంతస్తుల్లో నిర్మించే ఈ అత్యాధునిక దవాఖాన నిర్మాణ పనులను ఆర్ అండ్ బీ శాఖ పర్యవేక్షిస్తున్నది. 1,200 పడకలను జనరల్ విభాగాలకు, 800 పడకలను ఆంకాలజీ, న్యూరాలజీ వంటి స్పెషాలిటీ విభాగాలకు కేటాయించారు. హైదరాబాద్‌లో నిమ్స్, గాంధీ, ఉస్మానియాకు మాత్రమే పరిమితమైన అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను వరంగల్‌లో కూడా చేయాలని సంకల్పించారు. అత్యవసర సమయాల్లో ఉపయోగించేందుకు హెలిప్యాడ్‌ను సైతం నిర్మించాలని నిర్ణయించారు. 2022 ఏప్రిల్‌లో ఎల్ అండ్ టీ సంస్థకు లెటర్ ఆఫ్ ఆక్సెప్టెన్సీ సర్టిఫికెట్ అందజేశారు. అప్పటినుంచి కేసీఆర్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు దవాఖాన నిర్మాణ పనులు రాకెట్ వేగంతో సాగాయి. ప్రధాన భవనాల నిర్మాణం 80% పూర్తయినట్టు అధికారులు చెప్తున్నారు. నిరుడు దసరా నాటికే నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సంకల్పించారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హెల్త్‌సిటీ నిర్మాణ పనులు నిలిపివేసింది. ఎప్పుడో ఏడాది కిందటే పూర్తి కావాల్సిన పనులు.. ఇంకా ఎప్పుడు పూర్తవుతాయో, ఎప్పుడు ప్రారంభం అవుతుందో తెలియని పరిస్థితి.

లోకం పోకడ

పండుగకు కారో, బైకో అడుగుతారు గదే.. అల్లుడుగారు బుల్డోజర్ కావాలంటాడేంది?

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	37.9°c	21.8°c
మెదక్	35.3°c	21.6°c
రంగారెడ్డి	34.3°c	21.6°c
నిజామాబాద్	33.7°c	24.4°c
ఖమ్మం	33.0°c	24.0°c
కరీంనగర్	30.0°c	24.0°c
వరంగల్	30.0°c	24.0°c
నల్లగొండ	30.0°c	23.0°c
హైదరాబాద్	29.7°c	23.7°c
మహబూబ్‌నగర్	28.5°c	22.0°c

ప్రార్థనా మందిరాలపై ఆర్‌బీ ఎక్స్

ఇండ్లు, మందిరాలకు మార్కింగ్

కూల్చకుండా స్టే ఇవ్వాలంటూ హౌస్ మోషన్ పిటిషన్

దసరా తర్వాత విచారించనున్న రాష్ట్ర హైకోర్టు

అత్యవసర విచారణకు నిరాకరించిన న్యాయస్థానం

హైదరాబాద్, అక్టోబర్ 10, (నమస్తే తెలంగాణ)/సిటీ బ్యూరో: మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పేదలను నిర్వాసితులను చేయడమే కాదు.. ప్రార్థనా మందిరాలనూ కబళించనున్నదా? ఎన్నో ఏండ్ల ప్రాశస్త్యం కలిగిన చారిత్రాత్మక కట్టడాలు కాలగర్భంలో కలిసిపోనున్నాయా? లక్షలాది మంది ప్రజలు ప్రార్థించే మందిరాలు కనుమరుగు కానున్నాయా? అంటే అవుననే సంకేతాలు వినిపిస్తున్నాయి. మూసీ రివర్‌బెడ్, బఫర్‌జోన్ పరిధులే కాకుండా వాటిని దాటుకొని వెలుపల ఉన్న నిర్మాణాలపైనా అధికారులు ఆర్‌బీ-ఎక్స్ మార్క్ వేయడంపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు హైదరాబాద్ పేట్ల బురుజు ప్రాంతంలోని గురుద్వార్, హనుమాన్ ఆలయాలతోపాటు పలు ఇండ్లకు ఆర్‌బీ-ఎక్స్ మార్క్ వేయడంపై పలువురు ఏకంగా కోర్టుకెక్కారు. ఆ ప్రాంతానికి చెందిన హేమసుందర్ సింగ్‌దాస్ సహా మరో 15 మంది హైకోర్టులో శుక్రవారం అత్యవసర హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. అధికారులు తమ ప్రాంతంలోని ఇండ్లను, ఆలయాలను కూల్చివేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. హైకోర్టుకు దసరాకు సెలవులు ముగియనున్నందున గురువారం అత్యవసర విచారణకు హైకోర్టు నిరాకరించింది. ఈ నెల 14న హైకోర్టు పునఃప్రారంభం అయ్యాక విచారణ జరిగే అవకాశం ఉన్నది.

నిజాం ఇనాంగా ఇచ్చిన భూమి

గురుద్వారాకు 4.20 ఎకరాల భూమిని నాడు నిజాం కాలంలో కేటాయించినట్టు బాధితులు పేర్కొన్నారు. యాత్రికుల సౌకర్యార్థం అక్కడ ధర్మశాల కూడా నిర్మాణం జరిగింది. గురుద్వారాకు నిజాం పాలనలో పన్ను మినహాయింపు కూడా లభించింది. గత 80 ఏండ్లుగా వారంతా గురుద్వారాకు సమీపంలోని ఇండ్లలోనే నివసిస్తున్నారు. విద్యుత్తు, తాగునీరు ఇతర సౌకర్యాలకు బిల్లులు చెల్లిస్తున్నారు. పిటిషనర్లకు టైటిల్ డీడ్లు కూడా ఉన్నాయి. హైదరాబాద్ సిటీకి లోపల, మూసీ సరిహద్దు గోడకు వెలుపల ఉన్న భూమిలోని తమ నిర్మాణాలను కూల్చివేతలు చేపట్టకుండా ఉత్తర్వులు ఇవ్వాలని, తమ నిర్మాణాల కూల్చివేతలు చట్టవ్యతిరేకమని ప్రకటించాలి.. అని పిటిషన్లో హైకోర్టును కోరారు. ఆ ప్రాంతంలోనే హనుమాన్ ఆలయం కూడా ఉన్నది. అటు గురుద్వారా, ఇటు హనుమాన్ ఆలయాలను కూల్చవద్దని ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వారు కోర్టును కోరారు.

ఎల్‌యూసీ జారీ బంద్

గుట్టలుగా పేరుకుపోయిన దరఖాస్తులు

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో టీఎస్‌బీపాస్ ద్వారా జారీచేసే ల్యాండ్ యూజ్ సర్టిఫికెట్ (ఎల్‌యూసీ)ల జారీ నిలిచిపోయింది. హెచ్‌ఎండీఏ పరిధిలో ఏ సర్వే నంబర్ ఏ జోన్ పరిధిలోకి వస్తుందనే సమాచారాన్ని టీఎస్‌బీపాస్ ద్వారా అధికారికంగా జారీ చేసేందుకు గతంలో ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. భూమి క్రయవిక్రయాలు జరిపేవారు ముందుగా అది వ్యవసాయ భూమా? పారిశ్రామికవాడకు సంబంధించిన భూమా లేక ఇండ్లు నిర్మించుకోవడానికి అనుమతించే జోన్‌లో ఉన్నదా? అనే వివరాలను ల్యాండ్ యూజ్ సర్టిఫికెట్ ద్వారా పక్కాగా తెలుసుకునేందుకు వీలయ్యేది. ఇందుకోసం రూ.1,000 ఫీజు చెల్లించి ఆన్‌లైన్ ద్వారా టీఎస్‌బీపాస్‌లో సర్వే నంబర్, గ్రామం, పట్టణం తదితర వివరాలను సమర్పిస్తే ఈ సర్టిఫికెట్‌ను జారీ చేసేవారు. కానీ, గత కొంత కాలంగా వీటి జారీని నిలిపివేశారు. దీంతో ఇప్పటికే ల్యాండ్ యూజ్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు పేరుకుపోయాయి. హైడ్రా కూల్చివేతల నేపథ్యంలోనే ఇలా చేస్తున్నారని చెప్తున్నారు. హైడ్రా తీరు సమస్యాత్మకంగా మారడం, గతంలో అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలకు ఒత్తిడి పెరుగుతున్నందు వల్లే ఈ సర్టిఫికెట్ల జారీ నిలిచిపోయిందని భావిస్తున్నారు.

రిజిస్ట్రేషన్లపై హైడ్రా బాంబ్!

- సెప్టెంబర్‌లో పడిపోయిన లావాదేవీలు
- వరుసగా రెండో నెలలోనూ తిరోగమనం
- బుల్డోజర్ల భయంతో కొనుగోళ్లు డౌన్
- కొనుగోళ్లపై ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ టెన్షన్
- నిరుడి కన్నా 20% తగ్గిన లావాదేవీలు
- ఖజానాకు 30% మేర తగ్గిన రాబడి
- రియల్ ఎస్టేట్ వ్యాపారుల బెంబేలు

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో హైడ్రా ప్రకంపనలు కొనసాగుతూనే ఉన్నాయి. బుల్డోజర్ల భయానికి రెండు నెలలుగా రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం చిగురుటాకులా వణుకుతున్నది. కూల్చివేతల కారణంగా ఇండ్లు, ఫ్లాట్ల కొనుగోళ్లు తగ్గుముఖం పట్టగా.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ టెన్షన్‌తో ప్లాట్ల కొనుగోళ్లు అమాంతం పడిపోయాయి. ఫలితంగా రాష్ట్రంలో గత రెండు నెలలుగా వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. రాష్ట్ర ఖజానాపై 'హైడ్రా' ఓ బాంబులా పరిణమించిందని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో హైడ్రా హడావుడి మొదలైన ఆగస్టు నుంచి క్రమంగా రిజిస్ట్రేషన్ల సంఖ్య సగటున 20 శాతం, ఆదాయం సగటున 30 శాతం పడిపోయిందని చెప్తున్నారు.

రెండు నెలలుగా పడిపోయిన ఆదాయం

రాష్ట్రంలో ఆగస్టు రెండో వారం నుంచి వ్యవసాయ, వ్యవసాయేతర భూముల లావాదేవీల్లో తిరోగమనం నెలకొన్నది. గణాంకాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేస్తున్నాయి. జూలైతో పోల్చితే ఆగస్టు, సెప్టెంబర్‌లో వరుసగా రిజిస్ట్రేషన్లు తగ్గడంతోపాటు ఖజానాకు గండి పడుతున్నది.

- ఈ ఏడాది జూలైతో పోల్చితే ఆగస్టులో రిజిస్ట్రేషన్లు 27.39 శాతం తగ్గగా, ఆదాయం ఏకంగా 30 శాతం పడిపోయింది. సెప్టెంబర్ పరిస్థితి మరింత దిగజారింది. రిజిస్ట్రేషన్లు 13 శాతం తగ్గగా.. ఖజానాకు రాబడి 28 శాతం తగ్గింది.
- హైడ్రా రాకముందు, వచ్చిన రెండు నెలల తర్వాత గణాంకాలే మార్పును స్పష్టం చేస్తున్నాయి. జూలైలో రూ.1,531 కోట్ల ఆదాయం రాగా, సెప్టెంబర్ నాటికి ఏకంగా సగానికి పడిపోయింది. కేవలం రూ.770 కోట్ల ఆదాయమే వచ్చింది. రిజిస్ట్రేషన్లు జూలైలో 2.04 లక్షలు కాగా, సెప్టెంబర్ నాటికి 36 శాతం తగ్గాయి.

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఫోబియా

ప్రస్తుతం రాష్ట్రంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఫోబియా పట్టుకున్నదని రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. ఒకప్పుడు కొనుగోలుదారులు వెంచర్లకు, అపార్ట్‌మెంట్లకు, ఇండ్లకు అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులు ఉంటే నమ్మకంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేవారని చెప్తున్నారు. కానీ, ఇప్పుడు ఏ ఇల్లు, ఫ్లాట్, స్థలానికి సంబంధించి అన్ని అనుమతి పత్రాలు చూపినా నమ్మడం లేదని అంటున్నారు. చెరువుకు ఎంత దూరంలో ఉన్నది? ఎఫ్‌టీఎల్ పరిధి ఎంత వరకు? బఫర్ జోన్ కిందికి వస్తుందా? హైడ్రా కూల్చేస్తుందా? అంటూ ఒకటికి వందసార్లు చెక్ చేసుకుంటున్నారని చెప్తున్నారు. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో ఆస్తులు కొనుగోలు చేసే వారిలో ఈ భయాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వాస్తవానికి హైడ్రా ఔటర్ రింగ్‌రోడ్ వరకు మాత్రమే పరిమితమని ప్రభుత్వం చెప్తున్నది.

ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రిజిస్ట్రేషన్లు, ఆదాయం వివరాలు

నెల	రిజిస్ట్రేషన్ల సంఖ్య		తగ్గుదల	ఆదాయం (రూ.కోట్లలో)		తగ్గుదల
	2023	2024		2023	2024	
ఆగస్టు	1,71,958	1,48,643	23,315	1127	1071	56
సెప్టెంబర్	1,61,988	1,29,784	32,204	1120	770	350

స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలో గత మూడు నెలల లావాదేవీలు

నెల	రిజిస్ట్రేషన్లు			తగ్గుదల	ఆదాయం (రూ.కోట్లలో)			తగ్గుదల
	వ్యవసాయ	వ్యవసాయేతర	మొత్తం		వ్యవసాయ	వ్యవసాయేతర	మొత్తం	
జూలై	71,339	1,33,377	2,04,716	--	194.42	1336.90	1531.32	--
ఆగస్టు	58,975	89,668	1,48,643	56,073	141.77	929.52	1071.29	460.03
సెప్టెంబర్	49,623	80,161	1,29,784	18,859	106.75	663.61	770.36	300.93

సుందర మూసీ అంత అర్జెంటా?

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం అత్యవసరంగా ఈ 'సుందరీకరణ' రాగం ఎందుకు ఎత్తుకున్నట్టు? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారిందని అంటున్నారు. ఇప్పటికిప్పుడు మూసీ సుందరీకరణను తెరమీదికి ఎందుకు తెచ్చారనే అనుమానాలు అందరిలో వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఈ ప్రాజెక్టు లేదు.. రేవంత్ రెడ్డి కూడా ప్రచారంలో ఎక్కడా ప్రస్తావించలేదు.. రాహుల్ గాంధీనో, ప్రియాంకగాంధీనో హామీ ఇవ్వలేదని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. మరి హఠాత్తుగా తెరమీదికి తెచ్చి, బుల్డోజర్లను ప్రయోగించి, వివాదాస్పద కంపెనీకి పనులు కట్టబెట్టి నానాయాగీ ఎందుకు చేస్తున్నారనేది అర్థం కావడం లేదని అంటున్నారు.

నాటి కాంగ్రెస్‌కు.. రేవంత్ కాంగ్రెస్‌కు ఎంతో తేడా

వాస్తవానికి మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కొత్తదేం కాదన్నది నిపుణుల మాట. ఉమ్మడి రాష్ట్రంలో 1990వ దశకం నుంచి మూసీ సుందరీకరణకు, నదీపరీవాహకంలోని ఆక్రమణలు ఖాళీ చేయించేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయని అంటున్నారు. ప్రభుత్వాలు రూ.వందల కోట్లలో ఖర్చుచేశాయని, అయినా పూర్తి కాలేదన్నారు. ఇటీవల కాంగ్రెస్ నేత కేవీపీ రామచందర్‌రావు సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలోనూ ఈ విషయాన్ని ప్రస్తావించారని చెప్తున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ మూసీ సుందరీకరణ ప్రాజెక్టు చేపట్టాలని అనుకున్నారని, అయితే ఆర్థిక భారం గురించి ఆలోచించి వెనక్కి తగ్గారని చెప్పారు. అంటే ఉమ్మడి రాష్ట్రమే మోయలేనంత ఆర్థిక భారాన్ని తెలంగాణ నెత్తిమీద మోపేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఆర్థిక భారం కావొద్దని నాటి కాంగ్రెస్ భావిస్తే.. రాష్ట్రం ఆగమైనా సరే మా ప్రయోజనాలే ముఖ్యమని రేవంత్ కాంగ్రెస్ భావిస్తున్నదని విమర్శిస్తున్నారు.

నిధులు ఎక్కడి నుంచి తెస్తారు?

మూసీ సుందరీకరణకు రూ.8 వేల కోట్లు వ్యయం అవుతుందని 2022లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం అంచనా వేసిందని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు ఆ వ్యయం ఏకంగా 19 రెట్లు పెరిగి రూ.లక్షన్నర కోట్లకు చేరిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ స్థాయిలో ఎందుకు పెరిగిందో అర్థం కావడం లేదని అంటున్నారు. పైగా.. రాష్ట్రానికి స్థిరంగా మంచి ఆదాయం వచ్చి, మిగులు బడ్జెట్ ఉన్నప్పుడే సుందరీకరణ వంటి పనులు చేపడుతుంటారని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. కానీ ప్రస్తుతం రాష్ట్రానికి రాబడి రోజురోజుకూ తగ్గుతున్నదని స్పష్టం చేస్తున్నారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం రెండు నెలలుగా 20-30 శాతం తగ్గుతుండటమే ఇందుకు నిదర్శనమన్నారు. మరోవైపు అధికారంలోకి వచ్చిన తొలి పది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.73 వేల కోట్ల వరకూ అప్పులు చేసిందని గుర్తు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుగా భావిస్తున్న మూసీ సుందరీకరణకు రూ.లక్షన్నర కోట్ల నిధులు ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రపంచబ్యాంకు, జైకా తదితర అంతర్జాతీయ రుణ సంస్థల నుంచి నిధులు సమీకరిస్తామని ప్రభుత్వం చెప్తున్నదని.. అయితే ఆయా సంస్థలు సవాలక్ష కొర్రీలు, షరతులు విధిస్తాయని చెప్తున్నారు. వాటి నిబంధనలను తలొగ్గి, వాళ్లుచెప్పినట్టల్లా తలాడిస్తూ సుందరీకరణ చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నిస్తున్నారు.



తమ ఇండ్లు ఎప్పుడు కూలుస్తారోనన్న ఆందోళనతో ఉన్న మూసీ సమీపంలోని ఇండ్ల బాధితులు

నిబంధనలన్నీ తుంగలో తొక్కాల్సిన అవసరం ఏమున్నది?

ఒకవేళ ప్రభుత్వం మూసీ సుందరీకరణ చేయాలని సంకల్పిస్తే.. ఇప్పుడు చేసే విధానం సరైనది కాదన్నది విశ్లేషకుల మాట. ముందుగా నీటిని శుద్ధి చేసి, ఆ తర్వాత సుందరీకరణ చేయాలని.. మొదట మూసీ పరివాహకంలో ఉన్న పేదలకు ప్రత్యామ్నాయం చూపెట్టి, ఆ తర్వాత కూల్చివేతలు జరపాల్సి ఉంటుందని చెప్తున్నారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొదలు చేయాల్సిన పనులను వదిలిపెట్టి.. కేవలం కూల్చివేతలపై దృష్టిపెట్టడం వెనుక మతలబు ఏమిటని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మూసీలో మానవ వ్యర్థాలతోపాటు పారిశ్రామిక రసాయనాలు కలవడం నిత్యకృత్యమని గుర్తు చేస్తున్నారు. ఆయా వ్యర్థాలు, రసాయనాలను నదిలో కలువనీయకుండా ఉంచుతూ.. సీవరేజీ వ్యవస్థను కచ్చితంగా నిర్వహిస్తేనే మూసీ శుద్ధి సాధ్యమవుతుందని చెప్తున్నారు. కానీ రేవంత్ ప్రభుత్వం నీళ్ల శుద్ధి గురించి ఇప్పటివరకు ఒక్క ముక్క కూడా మాట్లాడటం లేదని మండిపడుతున్నారు. ఇక మూసీ పరివాహకంలోని ఇండ్లను ఖాళీ చేయాలన్నా, ప్రజలను తరలించాలన్నా చట్టంలో కొన్ని నిబంధనలు ఉన్నాయని, వాటిని పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని మేధావులు, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ముందుగా నోటీసులు ఇవ్వడం, వారికి ప్రత్యామ్నాయం చూపించడం వంటివి చేసిన తర్వాతే కూల్చివేతలు జరపాల్సి ఉంటుందన్నారు. కానీ ప్రభుత్వం ఏకంగా రెడ్ మార్కింగ్ వేసి, బుల్డోజర్లు తెచ్చి కూల్చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఓ పద్ధతి పాడు లేదా?' అం